సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



ఆరాధ్యుడు సేవాలాల్

సేవాలాల్ మహారాజ్ కేవలం గిరిజనుల ఆరాధ్య దైవం మాత్రమే కాదని, అందరికీ ఆరాధ్యుడేనని నాయకులు కొనియాడారు.

10లో..



షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

న్యాల్‌కల్ మండల పరిధిలోని చినిగెపల్లిలో షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధమైంది. సుమారు 180 క్వింటాళ్ల వరకు కాలిపోగా.. రూ.14 లక్షల మేర నష్టం వాటిల్లింది.

10లో..



అంధత్వ నివారణే లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా కంటివెలుగు శిబిరాల్లో కంటి పరీక్షలు విస్తృతంగా జరుగుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు పరీక్షల తీరును పరిశీలించారు.

11లో..

పర్యాటకం పరుగులు

కాళేశ్వరం టూరిస్ట్ సర్క్యూట్‌కు రూ.750 కోట్లు

- ఫారెస్ట్ కళాశాలకు రూ.100 కోట్లు
- గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి మరో రూ.100 కోట్లు
- ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూకు రూ.17.5 కోట్లు
- రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లా ప్రాజెక్ట్‌లు, అభివృద్ధి పనులకు భారీగా కేటాయింపులు

సాక్షి, సిద్దిపేట: రాష్ట్ర శాసనసభలో సోమవారం ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో జిల్లా పర్యాటకం పరుగులు పెట్టనుంది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు అనుబంధంగా కొండపోచమ్మ, కొమురవెల్లి మల్లన్న, రంగనాయకసాగర్ రిజర్వాయర్లున్నాయి. కాళేశ్వరం పరిసరాల్లో పర్యాటకాన్ని అభివృద్ధి చేసుకుందుకు రూ.750 కోట్లు కేటాయించారు. కాగా ఇప్పటికే రంగనాయకసాగర్‌కు రూ.125 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ అభివృద్ధి కార్యక్రమాలతో జిల్లాలోని ప్రాజెక్ట్‌లు టూరిస్ట్ స్పాట్‌గా మారనున్నాయి.

రైతులకు మరింత లబ్ధి





మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ వ్యూ..

బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.26,831 కోట్లను కేటాయించారు. జిల్లాలో 2022–23 యాసంగిలో రైతుబంధును 2.91 లక్షల మంది రైతులకు రూ.300 కోట్లను అందించారు. అలాగే జిల్లాలో మొదటి విడత రైతు రుణమాఫీలో రూ.25వేలలోపు పంటరుణం పొందిన 11,054 మంది రైతులకు రూ.16.3 కోట్లు, రెండో విడతలో రూ.50 వేల లోపు 2,772 మంది రైతులకు రూ.94.56 కోట్ల రుణమాఫీ చేశారు. తాజాగా రూ.90 వేలలోపు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించి ఈ బడ్జెట్‌లో రూ.6,385 కోట్లను కేటాయించారు. దీంతో రైతులకు లబ్ధి చేకునుంది.

గడాకు రూ.వంద కోట్లు

గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(గడా)కు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.100 కోట్లను కేటాయించారు. సీఎం సొంత నియోజకవర్గం కావడంతో గతేడాది నుంచి ప్రత్యేక నిధులను కేటాయిస్తున్నారు. దీంతో గజ్వేల్ నియోజకవర్గ పరిధిలో మరింత అభివృద్ధి జరగనుంది.



అటవీ కళాశాలకు నిధులు

జిల్లాలో అటవీ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. 2016లో అటవీ కళాశాల, పరిశోధన సంస్థను ప్రారంభించారు. తొలుత సొంత భవనం లేకపోవడంతో హైదరాబాద్‌లోని దూళపల్లి ఫారెస్ట్ అకాడమీలో ప్రారంభించారు. 2019 నుంచి సిద్దిపేట జిల్లా ములుగు సమీపంలో నూతన భవనంను నిర్మించారు. అటవీ కళాశాల, పరిశోధన సంస్థలు పరిధిలో కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం కొనసాగుతోంది. గతంలోనే అటవీ



కళాశాలను విశ్వవిద్యాలయంగా మార్చాలని కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇంకా గెజిట్ రావల్సి ఉంది. తాజా బడ్జెట్‌లో కళాశాలకు రూ.100 కోట్లు కేటాయించారు. ఈ యేడు విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుంది.



శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న ఆర్థిక మంత్రి హరీశ్‌రావు

ఇంటినిర్మాణానికి రూ.3 లక్షలు..

సొంత స్థలంలో ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించనుంది. నియోజకవర్గానికి 2 వేల ఇళ్ల చొప్పున జిల్లాకు సుమారుగా జిల్లాలో 8 వేల లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందనుంది. దీంతో సొంత స్థలంలో సొంతింటి కల నేరవేరనుంది.

దళితబంధుకు సుమారు 3,500 మంది

దళిత బంధు పథకానికి రూ.17,700 కోట్లను కేటాయించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 496 మంది లబ్ధిదారులకు రూ.10 లక్షల చొప్పున అందించారు. 2023–24లో నియోజకవర్గానికి 1,100 మంది చొప్పున ఎంపిక చేయనున్నారు. ఈ సారి జిల్లా వ్యాప్తంగా సుమారుగా 3,500 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి భరోసా ఇవ్వనున్నారు.

ఉద్యాన విశ్వవిద్యాలయానికి రూ.17.5 కోట్లు

ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం అనుబంధంగా రాష్ట్ర వ్యాప్తంగా 11 పరిశోధన స్థానాలు, రెండు బోధన కళాశాలలు, ఒక కృషి విజ్ఞాన కేంద్రం, రెండు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు, మరో మూడు అనుబంధ పాలిటెక్నిక్‌లు, కొనసాగుతున్నాయి. బడ్జెట్‌లో ఈ యూనివర్సిటీకి రూ.17.5 కోట్లను కేటాయించారు. దీంతో మరిన్ని పరిశోధనలు చేసి రైతులకు మేలు రకమైన పండ్ల మొక్కలు, మిర్చి రకాలను అందించనున్నారు. అలాగే అత్యుత్తమ విద్యాబోధన అందించి ఉద్యాన విద్యార్థులను తీర్చిదిద్దనున్నారు.



అన్ని రంగాలకు సమ ప్రాధాన్యం



అభివృద్ధి, సంక్షేమ రంగాలకు సమతుల ప్రాధ్యానం ఇచ్చారు. వ్యవసారంగానికి నిధుల కేటాయింపులో పెద్దపీట వేశారు. స్థానిక సంస్థలకు నేరుగా నిధులు విడుదల చేయడం హర్షనీయం. **–రోజాశర్మ, జెడ్పీ చైర్‌పర్సన్**

ప్రజలకు అనుకూలమైన బడ్జెట్



ఇది ప్రజా సంక్షేమ బడ్జెట్. సంక్షేమమే ధ్యేయంగా దీన్ని రూపొందించారు. అన్నిరంగాల అభివృద్ధే లక్ష్యంగా ఉంది. రాష్ట్ర బడ్జెట్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది. బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి హరీశ్‌రావుకు శుభాకాంక్షలు.

–సతీశ్‌కుమార్, హుస్నాబాద్ ఎమ్మెల్యే

చారిత్రాత్మక పద్దు



రాష్ట్ర బడ్జెట్ చారిత్రాత్మకమైనది. అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని సిద్ధం చేశారు. పేద, బడుగు, బలహీన వర్గాలు, దళితులు ఇలా అన్ని వర్గాలకు సముచితంగా నిధులు కేటయించారు. సంక్షేమ పథకాలకు అధికంగా ప్రాధాన్యం కల్పించారు.

–ఫారూఖ్ హుస్సేన్, ఎమ్మెల్సీ

పేదరిక నిర్మూలనే లక్ష్యం



పేదరిక నిర్మూలన లక్ష్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ స్పష్టం చేసింది. బడ్జెట్ తీరు చాలా అద్భుతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల బలోపేతం పాటు అన్నివర్గాల సంక్షేమం ఇందులో స్పష్టంగా కనిపిస్తుంది.

–వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్

అన్ని వర్గాలకు మోసం



బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు. బీసీలను పూర్తిగా విస్మరించారు. రైతు రుణమాఫీకి రూ.20 వేల కోట్లు కావాల్సి ఉండగా కేవలం రూ.6,295 కోట్లు కేటాయించారు. బడ్జెట్ అంతా చూస్తే అబద్ధాలు అంకెల గారడి. నిరుద్యోగ భృతి ఊసేలేదు.

–అంబటి బాలేష్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు

దళితులకు ఒరిగిందేమీలేదు

రాష్ట్ర బడ్జెట్‌లో అంకెల గారడి తప్ప దళితులకు ఒరిగిందేమీలేదు. దళితబంధుకు రూ.17,700 కోట్లను కేటాయించి ఒక్క పైసా ఖర్చు చేయలేదు. మళ్లీ అవే నిధులను కేటాయిస్తూ అంకెలను చూపించారు.

–శంకర్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి

న్యూస్‌రీల్

మూడోవారం బుకింగ్ ఆదాయం రూ.41 లక్షలు



కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి జాతరలో భాగంగా మూడో వారం బుకింగ్ ఆదాయం రూ.41,78,794 వచ్చినట్లు సోమవారం ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో శనివారం రూ.2,61,583, ఆదివారం రూ.33,90,540, సోమవారం రూ.5,26,671 ఆర్జిత సేవలు, గదులు, దర్శనాలు, ప్రసాద విక్రయాలు తదితర వాటి ద్వారంస్వామి వారి ఖజానాకు సమకూరినట్లు వివరించారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని పరిశీలిస్తున్న ముజామ్మిల్‌ఖాన్

సిద్దిపేటఅర్బన్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ సూచించారు. సోమవారం అర్బన్ మండలం ఎల్లుపల్లిలో ప్రారంభమైన శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరం వద్ద సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని మెడికల్ సిబ్బందికి సూచించారు. అంతకుముందు ఎంపీపీ వంగ సవిత ప్రవీణ్ రెడ్డి, ఎంపీడీఓ సమ్మిరెడ్డి, సర్పంచ్ జయశ్రీరమేశ్‌తో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినోద్, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

విద్యారంగానికి తగ్గిన కేటాయిపులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం 2023–24 బడ్జెట్‌లో విద్యారంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్, అధ్యక్షుడు రెడ్డమైన అరవింద్ అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యారంగానికి రూ.19,093 కోట్లు మాత్రమే (15.21%) కేటాయించారన్నారు. ఈ నిధులతో విద్యారంగాన్ని ఏ విధంగా బలోపేతం చేస్తారన్నారు. జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు, ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటులను ఈ బడ్జెట్‌లో మరిచిరన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు కర్రోళ్ల నవీన్ , అంజలి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

జిల్లా న్యాయసేవా సమితి చైర్మన్ డాక్టర్ రఘురాం

సిద్దిపేటకమాన్: దేశ వ్యాప్తంగా డిఫెన్స్ లీగల్ సిస్టమ్ బలోపేతమే నల్సా(నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ) ధ్యేయమని జిల్లా న్యాయసేవా సమితి చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం అన్నారు. సిద్దిపేట కోర్టు ప్రాంగణంలో డిఫెన్స్ లీగల్ సిస్టమ్ కేంద్రం కార్యాలయాన్ని వర్చువల్ సిస్టమ్ ద్వారా చీఫ్ జస్టిస్ ఆఫ్ తెలంగాణ జస్టిస్ ఉజ్జల్ భుయాన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి రఘురాం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అందరికీ సమాన న్యాయం రాజ్యాంగ ఫలాలు అందాలనే ఉద్దేశంతో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట జిల్లా ఎంపిక చేయబడిందన్నారు. నిష్ణాతులైన న్యాయవాదుల ద్వారా దరఖాస్తు చేసుకున్న పేదలకు ఈ సిస్టమ్ ద్వారా న్యాయం పొందే వీలుంటుందన్నారు. నిందితులు పేద వారైతే లీగల్ సర్వీస్ అథారిటీని సంప్రదిస్తే బెయిల్ నుంచి కేసు పూర్తి స్థాయి పరిష్కారం అయ్యే వరకు సేవలు అందిస్తారన్నారు. అవసరమైతే అప్పీలు క్రిమినల్ కేసులు ఈ సిస్టం ద్వారా పేద నిందితులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తి భవాని, లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి స్వాతిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, కార్యదర్శి మంతూరి సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్‌రెడ్డి, సాయిబాబ, హరిశ్చంద్ర, కార్యలయ సూపరింటెండెంట్ మధుసూదన్‌రెడ్డి, బాలయ్య, శ్రీకర్‌రెడ్డి, రాజ్యలక్ష్మి, వెంకటేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.



లీగల్ సిస్టమ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

దాచారం పంచాయతీకి రూ.10వేల జరిమానా

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దాచారం పంచాయతీకి వినియోగదారుల కోర్టు రూ.10 వేల జరిమానా విధించింది. గ్రామానికి చెందిన బొడిగె రామచంద్రం 2011లో నల్లా కనెక్షన్ తీసుకున్నాడు. 2014–15లో నీళ్ల రావడం లేదని ఫిర్యాదు చేశాడు. అప్పటి పాలకవర్గం నీళ్ల ఇవ్వకపోవడమే కాకుండా పైపులైను మార్చి మానసిక వేదనకు గురి చేశారంటూ కరీంనగర్ జిల్లా వినియోగదారుల కోర్టును ఆశ్రయించాడు. పరిశీలించిన జడ్జి వెంటనే నల్లా కనెక్షన్ ఇస్తూ రామచంద్రానికి రూ.5 వేల జరిమానా, నష్ట పరిహారంగా మరో రూ.5వేలు చెల్లించాలని ఆదేశించింది. సర్పంచ్ శ్రీనివాస్, కార్యదర్శి సురేశ్‌లను వివరణ కోరగా గత పాలకవర్గంలో జరిగిన సమస్యగా వినియోగదారుల కోర్టులో తీర్పు వచ్చిందన్నారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

బాలసాహిత్య కృషి ప్రశంసనీయం

చలాకీ పిల్లలు, అల్లరి పిల్లలు పుస్తకాల ఆవిష్కరణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బాలసాహిత్య విభాగంలో సిద్దిపేట సాహితీవేత్తలు చేస్తున్న కృషి ప్రశంసనీయమని రాష్ట్రస్థాయి బాలసాహిత్య సమ్మేళనంలో వక్తలు అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి బాలసాహిత్య సమ్మేళనంలో జిల్లా రచయితలు హాజరయ్యారు. ప్రతిభావంతులైన బాలల సృజనానుభవాలు అంశంపై జరిగిన సమావేశానికి సిద్దిపేటకు చెందిన ఉండ్రాళ్ల రాజేశం అధ్యక్షత వహించగా, పాఠశాల – లలిత కళా వేదికలు అన్న అంశంపై జరిగిన చర్చ గోష్ఠిలో జిల్లా రచయితలు గుళ్లపల్లి తిరుమల క్రాంతికృష్ణ, జెగ్గారి నిర్మల, మచ్చ అనురాధ, మాధవీలత తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశాలలో ఎడ్ల లక్ష్మి రచించిన చలాకీ పిల్లలు, పెందోట వెంకటేశ్వర్లు రచించిన అల్లరి పిల్లలు బాలసాహిత్య పుస్తకాలు ఆవిష్కరించారు. రాష్ట్రస్థాయి బాలసాహిత్య సమ్మేళనంలో పాల్గొన్న బాలసాహితీవేత్తలు, అతిథులు, వక్తలు రమణాచారి, ఎల్లూరి శివారెడ్డి, చెన్నయ్య, మణికొండ వేదకుమార్, పత్తిపాక మోహన్, గరిపల్లి అశోక్, చొక్కాపు వెంకటరమణ, దాసరి వెంకటరమణ, పైడిమర్రి రామకృష్ణ, వేదాంతసూరి, అమ్మిన శ్రీనివాసరాజు, బివియస్ స్వామి, నలవోలు నరసింహారెడ్డి, పుప్పాల కృష్ణమూర్తి, వీఆర్ శర్మ, అమరవాది నీరజ, వాసరవేని పరుశురాం, తదితరులు మాట్లాడుతూ సిద్దిపేట బాలసాహితీవేత్తలు చేస్తున్న కృషిని అభినందించారు.



బాలకవులకు ప్రశంస పత్రాలను అందిస్తున్న దృశ్యం

నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి

డిగ్రీ కళాశాలలో ఇన్నోవేషన్ ల్యాబ్ ప్రారంభం

సిద్దిపేటఎడ్యుకేషన్: నూతన ఆలోచనలతో విభిన్న ఫలితాలను సాధించేందుకు ఇన్నోవేషన్ ల్యాబ్స్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయని అడిషన్ డీసీపీ మహేందర్ అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్ సోహం అకాడమీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్ ల్యాబ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇన్నోవేషన్ ల్యాబ్‌ను ఉపయోగించుకుని నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్, అకాడమీ డైరెక్టర్ సహదేవ్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాయిలో రాష్ట్రంలోనే మొట్టమొదటి ల్యాబ్‌ను సిద్దిపేటలో ఏర్పాటు చేసుకోవడం గర్వకారణమన్నారు. ఈ ల్యాబ్‌ను ఉపయోగించుకుని ఉన్నత స్థానాల్లో నిలిచేందుకు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. వినూత్న కార్యక్రమాల నిర్వహణలో ఎల్లప్పుడూ ముందుండే ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ మధుసూదన్, అధ్యాపకులను అభినందించారు. అనంతరం గత కొన్ని నెలలుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రోబోటిక్స్‌పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో రిసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరించిన కళాశాల విద్యార్థులకు సోహం అకాడమి తరఫున ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ గోపాలసుదర్శనం, అకడమిక్ సెల్ కన్వీనర్ డాక్టర్ భవానీ, ఫిజిక్స్ అధ్యాపకులు డాక్టర్ మహేష్, భైరయ్య, కృష్ణయ్య, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి
- ప్రజావాణికి 63 దరఖాస్తులు

సిద్దిపేటరూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలనుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ అర్జీని పరిశీలించి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు ప్రజావాణి దరఖాస్తుల సత్వర పరిష్కారంప దృష్టి సారించాలని సూచించారు. భూ సంబంధిత , డబుల్‌బెడ్రూం, ఆసరా పెన్షన్లు తదితర అంశాల నుంచి మొత్తం 63 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



వినతి పత్రాన్ని చూపుతున్న గ్రామస్తులు

మాది హుస్నాబాద్ మండలం. ఎస్ పోతారం గ్రామం. మాకు నివసించడానికి ఇళ్లు, ఉపాధి లేదు. గ్రామంలో ప్రభుత్వ భూమి 38 ఎకరాలు ఉంది. ఈ భూమిని అర్హులైన మాకు అందించి ఆదుకోవాలి. ప్రస్తుతం ఈ భూమి అక్రమంగా తప్పుడు పత్రాలు చూపించి గ్రామానికి చెందిన లావుడ్య నాయక్ అనే వ్యక్తి తనపేరు, కుటుంబ సభ్యుల పేరుపై నమోదు చేయించుకున్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

నా భూమిని నాకు ఇప్పించండి

నాపేరు దేవులపల్లి ఎల్లయ్య. గజ్వేల్ మండలం, ముట్రాజ్‌పల్లి. సర్వే నంబర్ 328లో ఎకరం భూమి ఉంది. యాభై ఏళ్లుగా సాగు చేస్తున్నాం. ఈ భూమిని అన్నదమ్ములమైన మేము నలుగురం సమానంగా పంచుకున్నాం. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు మా భూమికి సంబంధించి తప్పుడు పత్రాలను సృష్టించి వారి పేరు మీద నమోదు చేయించుకుని అమ్ముకున్నారు. వారిపై చర్యలు తీసుకుని నా భూమిని నాకు అందించాలి.

పంచాయతీ వివరాలు ఇవ్వడం లేదు



మేము కౌన్సిల్‌ఫర్ సిటిజన్ రైట్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులం. సిద్దిపేట నియోజకవర్గ పరిధిలోని నంగునూరు పంచాయతీ లో నిధులలో అవకతవకలు జరిగినట్లు మాకు అనుమానం ఉంది. ఈ విషయంపై సమాచార హక్కు చట్టం కింద వివరాలు కోరినా సంబంధిత అధికారులు సమాచారం ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. అందువల్ల సమాచారం ఇవ్వవలసిందిగా సూచించాలని కోరుతున్నాం. అలాగే అరకొర సమాచారం ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకుని, నష్టపరిహారం ఇప్పించాలి.

వయ్యారాల గోదారి.. హల్దీకి జలసిరి



వర్గల్(గజ్వేల్): వందల మైళ్ల నడకతో కొండపోచమ్మకు చేరిన గోదారమ్మ వర్గల్ మండలం హల్దీని ముద్దాడింది. వయ్యారాలు ఒలకబోస్తూ వాగులు వంకలు దాటుతూ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరి వద్ద జలసవ్వడులతో ఆహ్లాదం పంచుతుంది. క్షేత్రం ముందు నుంచి సాగిపోతున్న ప్రవాహాన్ని తిలకిస్తూ యాత్రికులు మురిసిపోతున్నారు.

క్లుప్తంగా

మహిళా ప్రాధాన్యంపై హర్షం

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



నర్సాపూర్: రాష్ట్ర బడ్జెట్‌లో మహిళల సంక్షేమం కోసం నిధులు కేటాయించడంపై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో మహిళల సంక్షేమానికి ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. సీఎం కేసీఆర్, ఆర్థిక మంత్రి హరీశ్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జయరెడ్డి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): కేసీఆర్ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, ప్రజాసంక్షేమాన్ని విస్మరించారని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తూర్పు జయరెడ్డి మండిపడ్డారు. సోమవారం మండల పరిధిలోని ఎల్లారంలో హత్‌సే హాథ జోడో పాదయాత్రను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడీల రాంరెడ్డితో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కాంగ్రెస్‌జెండా ఎగురవేసి తమ సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముగ్దుమ్ పటేల్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చాట్ల సిద్దన్న, సర్పంచ్‌లు భూపాల్ రెడ్డి,నర్సింలు,గంగన్న,ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్, సుగుణమ్మ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఆశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ప్రకటనపై ఉద్యోగుల హర్షం

మెదక్‌జోన్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల కుటుంబాలకు ఆరోగ్య భద్రత కల్పిస్తామని అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు సోమవారం ప్రకటించారు. మెదక్‌లో టీఎన్జీఓ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దొంత నరేందర్, మినికి రాజ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఆరోగ్య భద్రత కల్పిస్తూ అసెంబ్లీలో ప్రకటించడం హర్షణీయమన్నారు. అలాగే ఏటా రూ.700 కోట్ల బడ్జెట్‌ను ఈహెచ్‌ఎస్ అమలుకు ప్రభుత్వ నిధులు కేటాయిస్తామని చెప్పడం శుభ సూచకమన్నారు. ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సెర్ప్ ఉద్యోగులకు వేతన స్థిరీకరణ ప్రకటించిన సీఎం కేసీఆర్, ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం

కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ చైర్మన్ కనకచంద్రం

సిద్దిపేటఎడ్యుకేషన్: కాంట్రాక్టు ఉద్యోగులను ఏప్రిల్ నుంచి రెగ్యులరైజ్ చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చేసిన ప్రకటనపై కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కాంట్రాక్టు లెక్చరర్ల సంఘాల నాయకులతో సోమవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కాంట్రాక్టు ఉద్యోగుల సేవను గుర్తించి 12 నెలల వేతనం, బేసిక్ పే ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతిపక్షాలు నిరుద్యోగుల పేరుతో వేసిన కేసులను కొట్టివేయడంతో నేడు రెగ్యులరైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసిన మంత్రి హరీశ్‌రావు, సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. ఆయనతో పాటు కాంట్రాక్టు అధ్యాపకుల సంఘాల నాయకులు కొండల్, త్రిభువనేశ్వర్, అరుణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్ తదితరులున్నారు.



మంత్రి హరీశ్‌రావుకు ధన్యవాదాలు తెలుపుతున్న దృశ్యం

అందరికీ ఆరాధ్యుడు సేవాలాల్

- సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించేలా సీఎం దృష్టికి తీసుకెళ్తా
- హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై సేవాలాల్ విగ్రహం ఏర్పాటు చేయాలి
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎంపీ సీతారాంనాయక్



చౌడుతండాలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్

అక్కన్నపేట(హుస్నాబాద్): సేవాలాల్ మహారాజ్ కేవలం గిరిజనుల ఆరాధ్య దైవం మాత్రమే కాదని, అందరికీ ఆరాధ్యుడేనని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎంపీ సీతారాంనాయక్ అన్నారు. అక్కన్నపేట మండల కేంద్రంలోని చౌడుతండాలో ఆలిండియా బంజారా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ధరావత్ తిరుపతినాయక్ ఆధ్వర్యంలో సోమవారం సేవాలాల్ మహారాజ్ (284)వ జయంతి, భోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి, సాంప్రదాయాలు, సంస్కృతికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా తెలంగాణ రాష్ట్రంలో తప్ప దేశంలో ఇంకెక్కడా జరపడం లేదంటే ఇది తెలంగాణ రాష్ట్ర గొప్పదనమన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. అలాగే హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, ఆ దిశగా గిరిజనులంతా ఏకతాటిపైకి వచ్చి సీఎం దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బంజారా జాతి అంతరించకుండా కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతి గిరిజనుడిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తనయుడు వొడితెల ఇంద్రనీల్, ఎంపీపీ లక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, లంబాడా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉర్సె షరీఫ్ ఉత్సవాలు



ఉర్సె షరీఫ్ దర్గాను దర్శించుకుంటున్న ప్రజలు

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ శివారులలోగల ఉర్సె షరీఫ్ పిర్‌గైబ్ సాహెబ్ దర్గా ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా నాలుగో రోజు సోమవారం న్యాల్‌కల్ నుంచి దర్గా వరకు మేళతాళాలతో ఖురేషి గంధం తీసుకెళ్లారు. రాత్రి నిర్వహించిన ఖవ్వాలి వీక్షకులను అలరించింది. దర్గా పరిసర ప్రాంతాల నుంచే కాకుండా సమీప కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా ప్రజలు తరలి వచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం ఉత్సవాల్లో కొనసాగిన పశువుల సంత సోమవారం కూడా కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు, వ్యాపారులు క్రయవిక్రయాలు నిర్వహించారు. నేడు కుస్తీ పోటీలు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జాతరలో కుస్తీ పోటీలు నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రాకు చెందిన మల్లయోధులు పోటీల్లో పాల్గొననున్నారు. భారీ భద్రత మధ్య ఈ పోటీలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబర్చిన మల్లయోధులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

కౌడిపల్లి సబ్‌స్టేషన్‌లో కోతుల సంచారం

- విద్యుత్ వైర్లకు తగలడంతో కాలిపోయిన బ్రేకర్
- సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా కట్
- సుమారుగా రూ.10 లక్షల మేర నష్టం



మరమ్మతులు చేస్తున్న కార్మికులు

కౌడిపల్లి(నర్సాపూర్): సబ్‌స్టేషన్‌లో కోతులు సంచరిస్తున్నాయి. విద్యుత్‌వైర్లకు తగడంతో బ్రేకర్ కాలిపోయింది. దీంతో రెండు గ్రామాల సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా నిలిపోయింది. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు. ఈ సంఘటన మండల కేంద్రమైన కౌడిపల్లిలోని 132/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం జరిగింది. సబ్‌స్టేషన్ డీఈ జయమ్మ, కౌడిపల్లి ఇన్‌చార్జి ఏఈ రాంబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కౌడిపల్లిలో 132/11 కేవీ సబ్‌స్టేషన్‌లో కోతులు విద్యుత్‌వైర్లకు తగలడంతో సబ్‌స్టేషన్‌లోని బ్రేకర్ కాలిపోయింది. దీంతో కంచన్‌పల్లి, వెల్మకన్న గ్రామాలలోని సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సుమారు రూ.10 లక్షల మేర నష్టం వాటినట్లు తెలిపారు. హైదరాబాద్ కార్మికులు మరమ్మతులు చేస్తున్నారు.

అనాథలపై కనికరం లేదా?

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ
- 15న గజ్వేల్‌లో దీక్ష చేపట్టనున్నట్లు ప్రకటన



మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

గజ్వేల్: అనాథల సంక్షేమం కోసం ఏడేళ్ల క్రితం సీఎం కేసీఆర్ స్వయంగా ఇచ్చిన హామీ ఇంకా నెరవేరకపోవడం దారుణమని, దయనీయస్థితిలో ఉన్నవారిని పట్టించుకోని ప్రభుత్వం ఇంకా ఎవర్ని ఉద్ధరిస్తుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం గజ్వేల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్, కేటీఆర్‌ల తీరుపై మండిపడ్డారు. ఏడేళ్ల క్రితం తన సొంత నియోజకవర్గం గజ్వేల్‌లోని ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంలో ముఖ్యమంత్రి ఇద్దరు అనాథ బాలికల దీనగాథ తెలుసుకొని, ఇక రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనాథలకు కష్టాల్లేకుండా చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అప్పట్లోనే రాష్ట్రవ్యాప్తంగా 6 లక్షల మంది అనాథలు ఉన్నారని ప్రభుత్వ లెక్కల ద్వారా తేలిందని, నేడు ఆ సంఖ్య 10 లక్షలకు చేరి ఉంటుందని చెప్పారు. కానీ వారి బతుకుల్లో ఏమాత్రం మార్పులేదన్నారు. గతేడాది మంత్రి కేటీఆర్ స్వయంగా మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులపై ప్రకటన చేశారని గుర్తు చేశారు. ఇందులో ప్రధానంగా ఎలాంటి ఆధారం లేని అనాథలకు కులం, ఆదాయం, నివాసం సర్టిఫికెట్లు లేకున్నా వారి జీవితం సాగే విధంగా స్మార్ట్ కార్డులను అందిస్తామని, కేజీటూ పీజీ ఉచిత విద్యను అందిస్తామని ప్రకటన చేశారని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ లక్ష కోట్ల నుంచి 2 లక్షలపైచిలుకు కోట్లకు చేరుకున్నా ప్రస్తుత సందర్భంలోనూ ఆశ్రమాల్లో ఉండే అనాథలకు దాతలు సహకరించకపోతే తిండి దొరకని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. అనాథలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వానికి గుర్తు చేస్తూనే వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 15న గజ్వేల్‌లో పెద్ద ఎత్తున దీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నేతలు మైస రాములు, ముంద్రాతి క్రిష్ణ, లింగంపల్లి శ్రీనివాస్, మల్లుగారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు సోమవారం జరిమానా విధించింది. సిద్దిపేటలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 17 మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన జడ్జి రమేశ్‌బాబు రూ.38,500 జరిమానా విధించారు.

ఏడుగురు దొంగల అరెస్ట్

కొమురవెల్లి(సిద్దిపేట): జాతరలో దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురు జేబుదొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఉదయం స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తుడు తెడ్డు శ్రీనివాస్ ప్యాంటు జేబు నుంచి హైదరాబాద్ బాలాజీనగర్ చెందిన ఏడుగురు దొంగిలించి సమానంగా వాటాలు పంచుకున్నారు. వారు ఆలయం పరిసరాల్లో తిరుగుతుండగా కొమురవెల్లి పోలీసులకు అనుమానం వచ్చి పట్టుకున్నారు. వారి నుంచి రూ.9 వేల నగదు, స్కార్పియో వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

నిరుపేద కూలీ అంత్యక్రియలకు..



వెంకటయ్య (ఫైల్)

దుబ్బాకరూరల్: భూంపల్లి మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కూలీ ఏనుటి వెంకటయ్య(70) బతుకు దెరువు కోసం నిజామాబాద్ వెళ్లాడు. శుక్రవారం అక్కడ పనిచేస్తుండగా ప్రమాద వశాత్తు రైలు ఢీకొట్టి మృతి చెందాడు. మృతదేహం ఆచూకీ ఆదివారం లభించింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే రఘునందన్ రావు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సహకారంతో మృత దేహాన్ని సోమవారం స్వగ్రామం తీసుకొచ్చారు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్తులు చందాలువేసుకుని అంత్యక్రియలు నిర్వహించారు.

కుప్పకూలిన కూడవెల్లి పాత బ్రిడ్జి



అక్బర్‌పేటలోని కూడవెల్లి వాగులో కుప్ప కూలిన పాత బ్రిడ్జి

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని కూడవెల్లి వాగుపై శిథిలావస్థలో ఉన్న పాత బ్రిడ్జి నీటి ప్రవాహానికి సోమవారం ఒక్కసారిగా కుప్ప కూలింది. ఇటీవల మల్లన్న సాగర్‌లోని గోదావరి జలాలను కూడవెల్లి వాగులోకి వదలడంతో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. నిజాం కాలం నాటి బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో నీటి ప్రవాహానికి కూలిపోయింది. బ్రిడ్జి కూలడంతో దానిపై ఉన్న మిషన్ భగీరథ పైపు లైన్ ధ్వంసం అయ్యింది. దీంతో భగీరథ నీరు గంట పాటు వృథాగా పోయింది. విషయం తెలుసుకున్న అధికారులు భగీరథ నీటి సరఫరా నిలివిపివేశారు. బ్రిడ్జి కూలిన సమయంలో అటు వైపు వాహనాల రాకపోలు లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది.

జైలుకు పంపిన వారిపై చర్యలు తీసుకోవాలి

సిద్దిపేటకమాన్: హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, స్వాములను అక్రమంగా జైలుకు పంపిన వారిపై చర్యలు తీసుకోవాలని సిద్దిపేట టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు అఖిల భారత శివదీక్షా పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు, చైర్మన్ మొరంశెట్టి రాములు తెలిపారు. కొద్ది రోజుల క్రితం తాండూర్‌లో శివ భక్తులపై అక్రమ కేసులు పెట్టారన్నారు. మొదట నమోదు చేసిన సెక్షన్‌లు కాకుండా తర్వాత వాటిని మార్చి వారిని జైలుకు పంపారన్నారు. వారిని లాయర్‌తో మాట్లాడనీయకుండా భయభ్రాంతులకు గురిచేశారన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య



సజిద్ అలీ (ఫైల్)



విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

దుబ్బాక: ఆర్థిక ఇబ్బందులు తాళలేక జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాయపోల్ మండలం మంతూర్‌లో సోమవారం జరిగింది. రాయపోల్ ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంతూర్ గ్రామానికి చెందిన సజిద్ అలీ (48) వ్యవసాయం చేసేవాడు. రెండేళ్లుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. అప్పులు ఎలా తీర్చాలో తెయడంలేదని భార్యకు చెప్పి బాధపడేవాడు. ఆదివారం అర్ధరాత్రి ఉరివేసుకుననాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా చేశారు. మృతుడి సోదరుడు హైమద్ హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అనారోగ్య సమస్యలతో..

రామాయంపేట(మెదక్): అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వివాహిత చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ రంజిత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంపేట మండలం తిప్పనగుల్ల గ్రామానికిచెందిన గొల్ల కల్యాణిని ఐదేళ్ల క్రితం ధర్మారం గ్రామానికి చెందిన గొల్ల స్వామికి ఇచ్చి వివాహం చేశారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు జనవరి 18న జన్మించాడు. ఆమె ఆరోగ్యం సరిగా లేకపోవడంతో కల్యాణి తన తల్లిఎల్లవ్వ, అమ్మమ్మ నర్సవ్వతో కలిసి ధర్మారంలోని అత్తగారింటిలోనే ఉంటుంది. ఆదివారం రాత్రి అందరూ నిద్రించిన తర్వాత కల్యాణి తెల్లవారు జామున గ్రామశివారు ఊర చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. గ్రామాచెందిన యువకుడు చెరువు వద్దకు వెళ్లగా కల్యాణి మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. అతడు మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చెరువు వద్దకు వెళ్లారు. ఆత్మహత్యకు పాల్పడ్డ కల్యాణి మృతదేహం రెండు గంటల్లోపే నీటిపై తేలడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా సాక్షి ప్రీమియర్ లీగ్



గౌతమ్ జూనియర్ కళాశాల జట్టు



జేఎన్‌టీయు కూకట్‌పల్లి జట్టు

SPL SAKSHI PREMIER LEAGUE

SAKSHI SAKSHI DIGITAL MEDIA GROUP

ఫైనల్స్‌కు చేరిన జూనియర్ జట్లు...

ఘట్‌కేసర్: మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా, ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో సాక్షి ప్రీమియర్ లీగ్–4 (ఎస్‌పీఎల్) సోమవారం ఉత్సాహంగా కొనసాగాయి. ఈ పోటీల్లో గ్రేటర్ పరిధిలోని 65 జట్లు పాల్గొంటున్నాయి.

విజేతల వివరాలివీ...

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం–1లో

- మొదటి మ్యాచ్ సీనియర్ విభాగంలో సైనిక్‌పురి భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్–బి జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 58 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అనురాగ్ యూనివర్సిటీ జట్టు 6.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 59 పరుగులు చేసి విజయం సాధించింది.
- రెండో మ్యాచ్ జూనియర్ విభాగంలో తిరుమలగిరి గౌతమ్ జూనియర్ కళాశాల జట్టు మొదట బ్యాటింగ్ చేసి 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సికింద్రాబాద్ గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ జట్టు 9.3 ఓవర్లలో 56 పరుగులు చేసి ఓటమిపాలైంది.
- మూడో మ్యాచ్‌లో జూనియర్ విభాగంలో సైనిక్‌పురి భవాన్స్ శ్రీ అరబిందో కాలేజ్–ఎ జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 151 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన తిరుమల్‌గిరి గౌతమ్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 60 పరుగులు చేసి పరాజయం పాలైంది. భవాన్స్ జట్టు క్రీడాకారుడు సాధిక్ 40 బంతుల్లో 118 పరుగులు చేశాడు.

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం–2

- మొదటి మ్యాచ్‌లో జూనియర్ విభాగంలో శ్రీ దత్త డిప్లమో కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన అవినాశ్ కాలేజ్ 5.5 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 96 పరుగులు చేసి గెలుపొందింది. అవినాశ్ జట్టు క్రీడాకారుడు సనద్ 23 బంతుల్లో 55 పరుగులు చేశాడు.
- రెండో మ్యాచ్ సీనియర్ విభాగంలో దిల్‌సుఖ్‌నగర్ అవంతి పీజీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 67 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్–ఎ జట్టు 4.5 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 68 పరుగులు చేసి గెలుపొందింది.
- మూడో మ్యాచ్ జూనియర్ విభాగంలో గౌతమ్ కాలేజ్–ఎ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన అవినాశ్ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసి పరాజయం పాలైంది.

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం–3

- మొదటి మ్యాచ్‌లో శ్రీ అరబిందో జూనియర్ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 116 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన సీఎంఆర్ డిప్లమో కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 56 పరుగులు చేసి పరాజయం పాలయ్యింది.
- రెండో మ్యాచ్ సీనియర్ విభాగంలో జేఎన్టీయూ హైదరాబాద్‌హెచ్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 76 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన కేపీఆర్‌ఐటీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 74 పరుగులు చేసి పరాజయం పాలైంది.
- మూడో మ్యాచ్ సీనియర్ విభాగంలో సైనిక్‌పురి భవాన్స్ వివేకానంద ఎ–జట్టు 10 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 141 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన జేఎన్టీయూ హైదరాబాద్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 63 పరుగులు చేసి ఓడింది. భవాన్స్ క్రీడాకారుడు నితీశ్ 31 బంతుల్లో 68 పరుగులు చేశాడు.

ఫైనల్స్‌కు చేరిన జూనియర్ జట్లు...

జూనియర్ విభాగంలో సైనిక్‌పురి భవాన్స్ శ్రీ అరబిందో కాలేజ్, ఈసీఐఎల్ గౌతమ్ కాలేజ్ జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

ఒత్తిడిని అధిగమించాలి

జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాశ్



పరీక్షల తీరును పరిశీలిస్తున్న సూర్యప్రకాశ్

సిద్దిపేటఎడ్యుకేషన్: విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి ప్రశాంతంగా పరీక్షలను రాయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాశ్ సూచించారు. సిద్దిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రీ ఫైనల్ పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వార్షిక పరీక్షలను ప్రశాంతంగా రాసేందుకు ఈ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. మార్చిలో వార్షిక పరీక్షలు ఉన్నందున ప్రణాళికతో చదవాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల అధ్యాపకులు మరింత శ్రద్ధ తీసుకోవాలన్నారు. వార్షిక ఫలితాల్లో జిల్లాను ముందు వరుసలో ఉంచేందుకు బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శాడ సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

దాచారం గ్రామ పంచాయతీకి జరిమానా

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దాచారం గ్రామ పంచాయతీకి వినియోగదారుల ఫోరం జరిమానా విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. దాచారం గ్రామానికి చెందిన బొడిగె రామచంద్రం తనకు నల్లా కనెక్షన్ ఇచ్చినా నీళ్లు రాకుండా మరో పైపు లైన్‌కు మార్చారని 2011లో అప్పటి గ్రామ పంచాయతీ పాలకవర్గంపై కరీంనగర్‌లోని వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాడు. అప్పటి నుంచి నల్లా నీరు రాకున్నా ప్రతీ నెల నల్లా బిల్లు చెల్లిస్తున్నానని తెలిపాడు. సమస్యను విచారించిన ఫోరం జడ్జి వెంటనే బాధితుడు రామచంద్రంకు నల్లా కనెక్షన్ పునరుద్ధరించి నీల్లు ఇవ్వడమే కాకుండా ఆయనను మానసికంగా వేదించినందుకు రూ.5 వేలు, నష్ట పరిహారంగా మరో రూ.5 వేలు చెల్లించాలని గ్రామ పంచాయతీని ఇటీవల ఆదేశించిట్లు బాధితుడు తెలిపాడు.

అదృశ్యమైన.. చెరువులో శవమై



షేక్ నజర్ (ఫైల్)

దుబ్బాక: ఇంటి నుండి వెళ్లిన యువకుడు కనిపించకుండా పోయి చెరువులో శవమై తేలాడు. ఈ ఘటన రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో జరిగింది. సోమవారం రాయపోల్ ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన షేక్ నజర్(33) 2022 డిసెంబర్ 30వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతడి సోదరుడు షాదుల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నెల గడిచినా నజర్ ఆచూకీ లభించలేదు. ఆదివారం రాత్రి వడ్డేపల్లి గ్రామ శివారు చెరువులో ఓ రైతుకు మృతుదేహం కనిపంచడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించి పరిశీలించగా కనిపించకుండా పోయిన షేక్ నజర్‌దిగా గుర్తించారు. మృతుడి సోదరుడు షాదుల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్. శ్వేత సూచించారు. సిద్దిపేటకు చెందిన సాయికుమార్ తన సెల్‌ఫోన్‌లో ఓ లోన్ యాప్‌ను కొద్ది రోజుల క్రితం డౌన్‌లోడ్ చేసుకున్నాడు. దీంతో అతడి ప్రమేయం లేకుండానే మిగతా లోన్ యాప్స్‌కు తన ఫోన్ నంబర్‌కు యాక్సెస్ కావడంతో అతడి ఖాతాలోని రూ.37,804 డబ్బులు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే బాధితుడు తాను మోసపోయినట్లు గ్రహించి జాతీయ హెల్ప్ లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన పోలీసులు రూ.8,050 నగదును ఫ్రీజ్ చేశారు. సైబర్ నేరం జరిగిన వెంటనే లేదా 24 గంటలలోపు ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

ఇంట్లో జారిపడి యువతి మృత్యువాత



దివ్య (ఫైల్)

వర్గల్(గజ్వేల్): కుటుంబానికి సాయంగా ఉన్న కూతురి పెళ్లి చేద్దామనుకుంటున్న తల్లిదండ్రుల కోరిక తీరకముందే ఇంట్లో జారిపడిన మృత్యువాతపడింది. ఈ ఈ ఘటన సోమవారం వర్గల్ మండలం మజీద్‌పల్లిలో చోటుచేసుకున్నది. కుటుంబీకులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మజీద్‌పల్లికి చెందిన లింగ రమేశ్, పద్మ దంపతులకు బాబు, దివ్య ఇద్దరు పిల్లలు. కొడుకు డిగ్రీ, కూతురు దివ్య(21) డిప్లొమా కోర్సు పూర్తి చేశారు. ఆ కుటుంబానికి రెక్కల కష్టమే ఆధారం. దివ్య దుస్తులు కుడుతూ కుటుంబానికి సాయంగా ఉంది. బుధవారం తెల్లవారుజామున కాలకృత్యాల కోసం లేచిన దివ్య ప్రమాద వశాత్తు ఇంట్లోనే జారిపడింది. తలకు తీవ్ర గాయమై కొద్ది సేపట్లోనే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. వెంటనే ఆ యువతిని కుటుంబీకులు ములుగు సమీప ఆర్వీఎం ఆస్పత్రలించారు. అక్కడ ఐదురోజులపాటు మృత్యువుతో పోరాడిన దివ్య సోమవారం మృతిచెందింది.